ప్రజాశక్తి
గురువారం 18 జనవరి 2024
5
విజయనగరం

బాల కేంద్రంలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రాథమిక విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా బాల కేంద్రంలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్టు సంస్థ సూపరింటెండెంట్ బొర్రా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మహారాజా సంస్కృత ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఈ బాల కేంద్రంలో ప్రవేశాలకు 5నుండి 16ఏళ్ల మధ్య వయసు గల బాలబాలికలు అర్హులని తెలిపారు. సంవత్సరానికి 50 రూపాయలు ఫీజు చెల్లించి విద్యార్థులు బాలకేంద్రంలో చేరవచ్చునని, వీరికి శాస్త్రీయ గాత్ర సంగీతం, శాస్త్రీయ భరతనాట్యంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కోర్సులలో చేరేందుకు ఉత్సాహవంతులైన విద్యార్థులు ప్రభుత్వ సంస్కృత ఉన్నత పాఠశాలకు ఆదివారం మినహా నేరుగా వచ్చి గాని, 94415 72195 నెంబర్‌కు గాని ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు సంప్రదించవచ్చునని సూచించారు.

ప్రభుత్వ విధానాల కారణంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో క్రమంగా చెరకు సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది. తగినంతగా సాగులేదని సాకుచూపుతూ ఉన్న పరిశ్రమలను ప్రభుత్వం ఎత్తివేసింది. దీంతో, సాగు రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తూ అష్టకష్టాలతో సంకిలి ఫ్యాక్టరీకి తరలించుకోవాల్సిన దుస్థితి దాపురించింది.

తగ్గుతున్న చెరకు సాగు

- రైతుకు సహకార కరువు
- సుగర్ పాలసీ రూపొందించని రాష్ట్ర ప్రభుత్వం
- మద్దతు ధర కల్పించని కేంద్రం
- భీమసింగి సుగర్స్ తెరిపించేందుకు నిరాసక్తత

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం ఉమ్మడి జిల్లాలో ఒకప్పుడు చెరకు సాగుకు పెట్టింది పేరు. పెద్దగా సాగునీటి ప్రాజెక్టులు పెద్దగా లేకపోవడంతో నీటి వసతిలేమిని ఎదుర్కొనే చెరకు, గోగు, జనుములు విస్తారంగా పండేవి. అందుకే సుమారు 20కిపైగా జూట్ మిల్లులు, ఇటు భీమసింగి, అటు లచ్చయ్యపేట సుగర్ ఫ్యాక్టరీలు జిల్లాలో ఉండేవి. నిత్యం కార్మికులతో కళకళలాడేవి. ఇటు చెరకు, గోగు రైతులు కూడా ఉత్సాహంగా సాగుచేసేవారు. ఇదంతా ఒకప్పటి మాట. మారిన ప్రభుత్వ విధానాల కారణంగా మద్ధతు ధర లేకపోవడంతో దాదాపు గోగు, జనుముల సాగు క్రమంగా తగ్గిపోయింది. ఫలితంగా గోగు నార కొనుగోలు కేంద్రాలు (సిసిఎఫ్), జ్యూట్ మిల్లులు దాదాపు కనుమరుగయ్యా యి. . ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలో చెరకు సాగు సాగువిస్తీర్ణం 50వేల ఎకరాలకుపైగా ఉండేది. సాగులో రాష్ట్ర ప్రభుత్వ సహకారం లేకపోవడం, కేంద్ర ప్రభుత్వం మద్ధతు ధర కల్పించకపోవడం, గత పదేళ్లగా కొత్తగా పరిశోధనలు చేపట్టకపోవడం వంటి కారణాల వల్ల వల్ల ఫ్యాక్టరీల్లో రికవరీ తగ్గిపోయింది. దీంతో, రైతులు క్రమంగా చెరకు సాగును తగ్గించుకుంటున్నారు. 2014-15లో ఉమ్మడి విజయనగరం జిల్లాలో చెరకు సాధారణ విస్తీర్ణం 37,297 ఎకరాలుకాగా, ప్రస్తుతం 11,265 ఎకరాలకు తగ్గింది. దీన్నిబట్టి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 26,032 ఎకరాలు తగ్గిపోయినట్టు స్పష్టమౌతోంది. రాష్ట్రంలో చెరకు పరిశోధనలు గడిచిన రెండు దశాబ్ధాలకాలంగా జరగడం లేదు. ఫలితంగా సుమారు పదేళ్లగా కొత్తరకం విత్తనాలు అందుబాటులో లేకపోవడం వల్ల దిగుబడి కూడా సగానికి సగం తగ్గిపోతోంది. సుగర్ రికవరీ రేటు కూడా మన రాష్ట్రంలో 9.5శాతానికి మించి రావడం లేదు. మరోవైపు చెరకు రైతులకు సబ్సిడీ పథకాలు లేవు.

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 2014 నుంచి చెరకు సాగు

సంవత్సరం	విస్తీర్ణం (ఎకరాల్లో)
2014-15	37,297
2015-16	34,230
2016-17	33,180
2017-18	31,191
2018-19	29,237
2019-20	22,407
2020-21	14,882
2021-22	12,190
2022-23	11,265

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్ధతు ధర ప్రకటించక పోవడం వల్ల రైతులకు గిట్టుబాటు కాని పరిస్థితి. ధరలో లోటును భర్తీచేసే చెరకు పాలసీని కూడా పదేళ్ల క్రితమే అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేసింది. దీంతో, జిల్లాలో క్రమంగా సాగు విస్తీర్ణం తగ్గింది. భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో 60వేల ఎకరాల నుంచి 11వేల ఎకరాలకు తగ్గింది. అనివార్యంగా ఉత్పత్తి కూడా అదే స్థాయిలో తగ్గింది. ఇందుకు బాధ్యత వహించాల్సిన ప్రభుత్వం సాగు, దిగుబడి తగ్గడాన్ని బూచిగా చూపి ఏకంగా పరిశ్రమలనే మూసివేసింది. తొలుత ఆధునీకరణతో పేరుతో భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని మూసివేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం సామర్థ్యానికి తగ్గ చెరకు అందుబాటులో లేకపోవడం వల్ల తెరిపించలేమని జిల్లాకు చెందిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెబుతున్నారు. పైగా రైతులే తగినంతగా చెరకు పండించడం లేదంటూ బుకాయిస్తోంది. ఈ నేపథ్యంలో ధర కల్పించాల్సిన బాధ్యత ఎవరిది అంటూ ఎపి రైతుసంఘం, సిపిఎం నాయకులు ప్రశ్నిస్తున్నారు. ధర కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి లేదా? కేంద్రాన్ని ఎందుకు నిలదీయడం లేదు? రాష్ట్రంలోనైనా పెంచే ఆలోచన ఎందుకు చేయడం లేదు? అని చెరకు రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం సుగర్ ఫ్యాక్టరీలను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించడం లేదా రియల్ ఎస్టేట్‌గా మార్చడం వంటి చర్యలకు పాల్పడుతోందని ఎపి రైతు సంఘం, చెరకు రైతు సంఘం నాయకులు విమర్శిస్తున్నారు. అందుకు తగ్గట్టే సీతానగరం పరిధిలోని ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీ ఆస్తులను వేలం వేశారు. వీటిని అధికార పార్టీకి చెందిన నాయకులే వసపర్చుకున్నారని విమర్శలు ఉన్నాయి. దీనికి సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం సుమారు 40 నుంచి 60కిలో మీటర్ల దూరంలోవున్న రేగిడి మండలం సంకిలి సుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ ఏర్పాట్లు చేశామని ఉచిత సలహాలు ఇస్తోంది.

ధాన్యం రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు

- 3.40లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- 2.67 లక్షల టన్నులు సేకరించాం
- మరో 30వేల టన్నులకు ప్రతిపాదన
- రైతులకు రూ.400 కోట్ల చెల్లింపులు
- అధికారులతో మంత్రి బొత్స సమీక్ష

అధికారులతో చర్చిస్తున్న మంత్రి బొత్స

ప్రజాశక్తి-విజయనగరం

ప్రస్తుత ఖరీఫ్ సీజనులో జిల్లాలో ధాన్యం సేకరణలో రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి వెంటనే చెల్లింపులు చేశామన్నారు. ఖరీఫ్ సీజనులో ధాన్యం సేకరణ ప్రక్రియ జరుగుతున్న తీరుపై మంత్రి బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, పౌరసరఫరాల సంస్థ డిఎం మీనాకుమారి, డిఎస్‌ఒ మధుసూదన్, వ్యవసాయశాఖ జెడి విటి రామారావు, డిసిఒ రమేష్, మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ధాన్యం సేకరణ జరుగుతున్న తీరును కలెక్టర్, జెసిలు మంత్రికి వివరించారు. రైస్ మిల్లర్లు తమ సమస్యలపై మంత్రికి వివరించగా ఆయా అంశాలపైన మంత్రి అధికారులతో సమీక్షించారు. ఏదైనా మండలం నుంచి వచ్చిన ధాన్యం అక్కడ మిల్లులకు కేటాయించగా మిగిలిన తర్వాతే ఇతర మండలాలకు తరలించాలని ఆదేశించారు.అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజనులో 3.40 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యానికి గాను ఇప్పటివరకు 2.67 లక్షల టన్నులు రైతుల నుంచి సేకరించామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి గాను రూ.400 కోట్లు వారి ఖాతాల్లో జమచేశామన్నారు. జిల్లాలో వ్యవసాయ శాఖ చేపట్టిన ఇ- క్రాప్ నమోదు ఆధారంగా వరి పంట దిగుబడిని అంచనా వేసి స్థానిక వినియోగానికి పోను 3.40 లక్షల టన్నులు మార్కెట్‌కు వస్తుందని జిల్లా అధికారులు అంచనా వేసినట్టు వెల్లడించారు. ఈ మేరకు లక్ష్యాన్ని నిర్ణయించుకొని ధాన్యం సేకరణ చేపట్టామన్నారు. జిల్లాలో నిర్ణయించిన లక్ష్యం మేరకు మరో 82 వేల టన్నులు సేకరణ చేయాల్సి వుందని, దీనిని కూడా త్వరగా చేపట్టేలా ఆదేశాలిచ్చామన్నారు. రాజాం, ఎస్.కోట నియోజక వర్గాల పరిధిలో పంట రాక ఆలస్యమైన కారణంగా ఆ ప్రాంతాల నుంచి సుమారు 50 వేల టన్నులు రావలసి వుందని తెలిపారు. దీనికి అదనంగా ఈ ఏడాది నిర్వహించిన పంటకోత ప్రయోగాల ప్రకారం అదనపు దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ అంచనా వేసినందున అదనపు ధాన్యం సేకరణ అవసరమవుతుందని భావించి మరో 30 వేల టన్నుల ధాన్యం సేకరణకు అనుమతి ఇవ్వాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతూ ప్రతిపాదనలు పంపనున్నట్లు చెప్పారు.

అంబేద్కర్ స్మృతివనం ప్రారంభానికి తరలి రావాలి

రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ స్వరాజ్య మైదానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న భారతరత్న డా.బి.ఆర్.అంబేద్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జిల్లాలోని బడుగు బలహీన వర్గాల ప్రజానీకం తరలిరావాలని మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు.

జిఒ 11 ప్రకారం వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలోని ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికులకు జీవో 11 ప్రకారం వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం కమిషనర్ ఎస్.శ్రీనివాసరావుకు ఇంజినీరింగ్ విభాగ కార్మికుల వివరాలు అందజేశారు. ఈసందర్భంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీవో 11 ప్రకారం స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ కింద వేతనాలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ చెల్లించలేదన్నారు. జీవో ప్రకారం వేతనాలు చెల్లిస్తామని సమ్మె చర్చల్లో ప్రభుత్వం హామీ ఇచ్చినందున అమలు చేయాలని కోరారు. హామీలను అమలు చేయకపోతే పోరాటం చేస్తామన్నారు.

గిరిజనుల కష్టాలను సిఎంకు వివరిస్తా

ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకర్రావు • చిట్టెంపాడులో గంగమ్మ మృతదేహం సందర్శన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

గిరి శిఖరాల పైన ఉండే గిరి పుత్రుల కష్టాలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకర్రావు అన్నారు. గిరి పుత్రుల డోలిమోతలపై ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనాలకు ఆయన స్పందించి బుధవారం మండలంలోని మూల బొడ్డవర పంచాయతీ చిట్టెంపాడు గ్రామంలో చనిపోయిన మాదాల గంగమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు. ఆమె భర్త గంగులను ఓదార్చారు. అనంతరం ఆయన అక్కడ యువతతో మాట్లాడగా వారు పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. విశాఖ కేజిహెచ్ లో వైద్యం మాత్రమే చేస్తున్నారని, సరైన మందులు ఇవ్వటం లేదని వారు వాపోయారు. గిరిజనులకు అందాల్సిన హక్కులు సక్రమంగా అందటం లేదని. గిరిజన గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేక నాన్న అవస్థలు పడుతున్నామని తెలిపారు. గంగులు కుటుంబాన్ని ఓదార్చిన చైర్మన్ సమస్యలన్నిటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొట్టాం పిహెచ్‌సి వైద్యులు శిరీష, గిరిజన నాయకులు జె.గౌరీష్, తుమ్మి అప్పలరాజు దొర, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గంగమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న డివిజి శంకర్రావు

గట..గట..గట..

పండగ మూడు రోజులూ తాగిన మద్యం ఖరీదు రూ.5 కోట్లు

రూ.3 కోట్ల మాంసం విక్రయాలు

మద్యం షాపు వద్ద బారులు తీరిన జనాలు

ప్రజాశక్తి - విజయనగరంటౌన్

పండగల్లో పెద్ద పండగ సంక్రాంతి. సంప్రదాయబద్ధ పండగగా దీనికి పేరున్నా క్రమేపీ దీని తీరు మారుతోంది. భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో మద్యం ఏరులై పారడం పరిపాటిగా మారింది. ఈ సంక్రాంతికీ జిల్లాలో మాంసం, చేపల విక్రయాలు భారీగా జరిగాయి. మాంసాహారులకు ప్రీతిపాత్రమైన మంగళవారం కనుమ రావడంతో వారి ఎంజాయ్‌మెంట్‌కు అవధుల్లేకుండా పోయింది. జిల్లా మొత్తంగా పండగ మూడు రోజులతో పాటు ముక్కనుమ సందర్భంగా సుమారు రూ.5 కోట్లు విలువజేసే మద్యాన్ని జనం తాగేశారు. ఒక్క విజయనగరం పరిధిలోనే కోటి రూపాయలు మద్యం అమ్మకాలు జరిగాయి. వైన్‌షాపులు, బార్లు ముందు మందుబాబులు బారులు తీరారు.

జిల్లాలో 144 ప్రభుత్వ మద్యం షాపులు, 27 బార్లు ఉన్నాయి. ఇవన్నీ పండగ మూడురోజులూ రద్దీగా కనిపించాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కొనుక్కొని తాగేవారే ఎక్కువగా ఉన్నారు. మందుబాబులు మద్యాన్ని బహిరంగంగా రోడ్లపై సేవిస్తున్నా పోలీసులు పట్టించుకున్న దాఖలాలు లేవు. మద్యం పూటుగా తాగి అనేకమంది మద్యం షాపులున్న ప్రాంతాల్లోనే రోడ్లపై నిషాలో పడి కనిపించారు. కొంతమంది మద్యం బాబులు తాగిన మత్తులో ఊగుతూ, జోగుతూ పాదచారులను ఇబ్బందులకు గురిచేశారు. మద్యం దుకాణాల నిర్వాహకులు మూడు రోజులు ముందుగానే భారీ స్టాక్ తెచ్చుకొని సిద్ధంగా ఉంచారు. మందుబాబుల వ్యసనాన్ని, అవసరాలను మద్యం షాపుల ద్వారా ప్రభుత్వం భారీగానే సొమ్ము చేసుకుంది. బార్లు, ఎసి రెస్టారెంట్లలో అయితే ఎసి ఛార్జీలు కలుపుకొని ఒక ఫుల్ బాటిల్‌పై ఏకంగా రూ.120 పెంచేశారు. ఇక బీర్ విషయానికొస్తే ఒక్కో బాటిల్‌పై రూ.10 నుంచి రూ.15 వరకూ పెంచి విక్రయించారు. పండగ నెపంతో బార్ల నిర్వాహకులు ఇష్టానుసారంగా ధరలను పెంచినా పోలీసులుగానీ, ఎక్సైజ్ అధికారులుగానీ కన్నెత్తి కూడా చూడలేదు.

పోటాపోటీగా మాంసం విక్రయాలు

పండగ నేపథ్యంలో జిల్లాలో 8 లక్షల కోళ్లు, 5వేల మేకలు, గొర్రెలు జీర్ణమైయినట్లు అంచనా. జిల్లాలో ఏ చికెన్, మటన్ సెంటర్ చూసినా కిక్కిరిసి కనిపించాయి. క్యూలైన్లలో ఉండి మరీ కొనడం కనిపించింది. సోమవారం వరకూ కిలో స్కిన్ కోడి మాంసం రూ.180, స్కిన్ లెస్ రూ.200కు అమ్మగా మంగళవారం వాటి రేటును వరుసగా రూ.210, రూ.220కి పెంచేశారు. మటన్ కిలో రూ.800 ఉండగా రూ.900కి విక్రయించారు. చేపల అమ్మకాలు కూడా జోరుగానే సాగాయి. కొన్ని చికెన్ దుకాణాల వద్ద పెద్దపెద్ద క్యూలైన్లు కనిపించాయి.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

గజపతినగరంలో గంగిరెద్దుకు వినతినిస్తూ అంగన్వాడీల నిరసన

పర్యాటక కేంద్రంగా అంబేద్కర్ స్మృతివనం

- 19న ప్రారంభోత్సవానికి తరలిరావాలి
- రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ స్వరాజ్ మైదానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతివనం, విగ్రహావిష్కరణకు జిల్లా ప్రజానీకం పెద్ద ఎత్తున తరలిరావాలని రాష్ట్ర షెడ్యూల్డు కులాల కమిషన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ కోరారు. జిల్లాల పర్యటనలో భాగంగా బుధవారం నగరానికి వచ్చిన ఆయన స్థానిక జిల్లాపరిషత్ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలోనే కనీవినీ ఎరుగని రీతిలో అన్ని రకాల వసతులతో విజయవాడ నడిబొడ్డున 20 ఎకరాల విస్తీర్ణంలో అంబేద్కర్ స్మృతివనం గొప్ప పర్యాటక కేంద్రంగా రూపొంద బోతోందని పేర్కొన్నారు. ఈ స్మృతివనంలో 3 వేల మంది కూర్చొ నేందుకు వీలుగా మల్టీపర్పస్ కన్వెన్షన్ హాలు, 2 వేల మంది కూర్చొనేందుకు వీలుగా ఓపెన్ ఎయిర్ థియేటర్, 10 వేల పుస్తకాలతో భారీ గ్రంథాలయం వంటివి ఏర్పాటు కానున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రజలంతా పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. అంబేద్కర్ విగ్రహం సమానత్వానికి, స్వేచ్ఛకు, విజ్ఞానానికి చిహ్నమని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రామానందం, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సుధారాణి, డిఎస్‌పి గోవిందరావు, జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ కమిటీ సభ్యుడు బొంగ భానుమూర్తి, నగర కార్పొరేటర్ దాసరి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ ను కలసిన కలెక్టర్, ఎస్‌పి

జిల్లా పర్యటన నిమిత్తం నగరానికి వచ్చిన ఎస్‌సి కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌ను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్‌పి దీపిక పాటిల్ స్థానిక జిల్లాపరిషత్ అతిథి గృహంలో కలిశారు. జిల్లాలో ఎస్‌సిల రక్షణ, వారి సంక్షేమానికి సంబంధించి జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలపై వారు చైర్మన్‌తో చర్చించారు. ఎస్‌సిలు ఏదైనా సమస్యను విన్నవించుకోవడానికి అధికారుల వద్దకు వచ్చినపుడు సమస్యలను సావధానంగా ఆలకించాలని ఆయన సూచించారు. సందర్భంగా పలువరు దళిత సంఘాల ప్రతినిధులు ఎస్.సి. కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రాలు అందజేశారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లిమర్ల : దళితుల సమస్యలు పరిష్కరించాలని దళిత సంఘం నాయకులు కె.శ్రీనివాసరావు, టి.నరసయ్య, చింతపల్లి దుర్గారావు కోరారు. జెడ్‌పి అతిథి గృహంలో రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్‌ను కలిసి వినతి అందజేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ దళితులపై అన్యాయాలు, దాడులు పెరుగుతున్నా యన్నారు. అర్హతలుండి కూడా దళితులకు సంక్షేమ పథకాలలో మొండి చేయిచూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా దళితులు సాగుచేస్తున్న భూములకు హక్కులు కల్పించడంలో అధికారులు పక్షపాత ధోరణి చూపిస్తున్నారని , నెల్లిమర్ల మండలంలో పట్టాలు మంజూరు చేయడంలో కొన్ని వర్గాలకు అనుకూలంగా, కొందరికి ప్రతికూలంగా అధికార యంత్రాంగం పని చేస్తుందని తెలిపారు. ఎస్‌సి కమిషన్ చైర్మన్ దళితుల ఎదుర్కొంటున్న సమస్యలు పరిశీలించి పరిష్కరించాలని ఫిర్యాదులో కోరారు.

చైర్మన్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి దీపిక

37వ రోజుకు అంగన్వాడీల సమ్మె

కలెక్టరేట్ వద్ద నిరసన • గజపతినగరంలో గంగిరెద్దుకు వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం నాటికి 37వ రోజుకు చేరుకుంది.కనీస వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రధానంగా సమ్మె చేస్తున్నారు. సమ్మెలో భాగంగా కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 37 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం వేతనాలు చెల్లించ లేమని చెప్పడం సరికాదన్నారు. జీతాలు పెంచేవరకు ఉద్యమం కొనసాగు తుందన్నారు. ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడటం మానుకొని సమస్యలు పరిష్కారం కోసం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు.

గంగిరెద్దుకు వినతి

గజపతినగరం : సమ్మెలో భాగంగా అంగన్వాడీలంతా గంగిరెద్దుకు సమస్యలతో కూడిన వినతిని సమర్పించి నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి జీతాలు పెంచకుండా తమను ఇబ్బంది పెడుతున్నారని, మినీ కేంద్రాలను, మెయిన్ కేంద్రాలుగా మార్చడం లేదని, ఎక్స్‌గ్రేషియో, పెన్షన్ , గ్రాట్యుటీ వంటి సమస్యలను పరిష్కరించమంటే మొండిగా వ్యవహరిస్తున్నారని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం పునరాలోచించి చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కంచాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి, ప్రాజెక్టు నాయకులు అనురాధ, అప్పలకొండ, లక్ష్మి, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ యూనియన్ల ముఖ్య నాయకులతో చర్చలు సానుకూలంగా జరపకుండా ఆర్థికపరమైన విషయాన్ని ఎక్కడా చర్చించకుండా జులై తరువాత వేతనాలకు సంబంధించి చూద్దామని డొంక తిరుగుడు మాటలు చెబుతున్నారని అన్నారు. జులై తరువాత ఈ ప్రభుత్వం వస్తుందని గ్యారెంటీ ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. ప్రభుత్వం చర్చలకు పిలిచి సానుకూలంగా వ్యవహరించలేదని అన్నారు.ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాజెక్టుల దగ్గర ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని తెలిపారు. యూనియన్ నాయకులు డి.శ్యామల, డి.జయలక్ష్మి, వి.మాణిక్యం, కె.సుశీల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : సమ్మె శిబిరంలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

చైర్‌పర్సన్ షర్మిలారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉప్పాడ శివారెడ్డి

హౌసింగ్‌బోర్డు చైర్‌పర్సన్‌కు ఉప్పాడ శుభాకాంక్షలు

ప్రజాశక్తి- భోగాపురం

రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ నూతన చైర్‌పర్సన్‌గా షర్మిలా రెడ్డి బుధవారం విజయవాడలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు పరామర్శ

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక పురపాలక సంఘం పారిశుధ్య సేవలు అందిస్తున్న ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ కట్టా శివకుమార్ మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు బుధవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు

ముక్కాంలో తప్పిన అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి -భోగాపురం

మండలంలోని తీర ప్రాంతమైన ముక్కాం గ్రామంలో అగ్నిప్రమాదం తృటిలో తప్పింది. గ్రామానికి చెందిన అరజల్ల పోలయ్యకు చెందిన ఇంట్లో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పండగ కారణంగా గ్రామస్తులందరూ ఊర్లో ఉండడంతో వెంటనే ప్రమాదాన్ని నిలువరించగలిగారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్తులు అంటున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు చౌదరి బాబ్జీ

20న అరకులో టిడిపి బహిరంగ సభ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

అరుకు వ్యాలీలో ఈనెల 20న జరిగే 'రా-కదలిరా' బహిరంగ సభను విజయవంతం చేయాలని టిడిపి నియోజకవర్గ పార్టీ పరిశీలకులు చౌదరి బాబ్జీ పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షులు జి.ఎస్.నాయుడు ఆధ్వర్యంలో ఆయన ఇంటి వద్ద బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బాబ్జీ మాట్లాడారు. ప్రజలకు వైసిపి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను, దౌర్జన్యాలను, అక్రమాలను ఎత్తి చూపేందుక టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు రా కదలిరా కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. అందులో భాగంగా నిర్వహిస్తున్న సభకు ఎస్.కోట నియోజకవర్గం నుంచి 2వేల మంది హాజరు కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, భీశెట్టి అరుణ, ఎస్.కోట పట్టణ పార్టీ అధ్యక్షులు కొనెదం మల్లేశ్వరరావు, విశాఖ టిడిపి పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి కాపుగంటి శ్రీనివాసు, కనిశెట్టి ఈశ్వరరావు, చక్కా కిరణ్ కుమార్, యువత పెదగాడ రాజు, వాకాడ బాలు పాల్గొన్నారు.

నేడు మారథాన్

ప్రజాశక్తి-విజయనగరం

సామాజిక సమతా సంకల్ప మహోత్సవాల్లో భాగంగా గురువారం మారథాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటన లో తెలిపారు. గురువారం ఉదయం 7.30 గంటలకు రాజీవ్ క్రీడా మైదానంలో మొదలై కోట, సింహాచలం మేడ, గంటస్తంభం మీదుగా రాజీవ్ క్రీడా మైదానం వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో యువత, వాకర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం గావించాలని కలెక్టర్ కోరారు.

వైభవంగా జగన్నాథ జాతర

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ముకుందపురంలో జగన్నాథ స్వామి జాతర బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి చేరుకునే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సర్పంచ్, గ్రామపెద్దల ఆధ్వర్యాన ఈ జాతర జరిగింది.

నేడు సింగరాయిలో..

మండలంలోని సింగరాయ గ్రామంలో గురువారం గ్రామదేవత శ్రీ దుర్గాలమ్మ జాతర వైభవంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కోలాటాలు, తప్పెటగుళ్ళు, కాంగో ప్రదర్శన, చిటికెల భజనలు, చిన్నారుల డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

తీర్థాలతో గ్రామాల్లో సందడి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

తీర్థాలతో గ్రామాల్లో సందడి నెలకొందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని అలుగుబిల్లి గ్రామంలో జరిగిన బాల పేరంటాలు తీర్థంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిటిసి రాయవరపు చంద్రశేఖర్, సర్పంచి బోన్ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో ఆయన పూజలు చేశారు. తీర్థం సందర్భంగా నిర్వహించిన సాంస్కతి కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ధర్మవరం పంచాయతీ బక్కునాయుడుపేటలో అంకమ్మ పేరంటాలు తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఎద్దుల పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం గ్రామంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

మూలకు చేరక ముందే ప్రారంభించండి

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో ఇంటింటి నుంచి చెత్తను సేకరించేందుకు ప్రభుత్వం మున్సిపాలిటీకి 10 ఛార్జింగ్ చెత్త వాహనాలను మంజూరు చేసింది. ఈ వాహనాలు మున్సిపాలిటీకి వచ్చి మూడు నెలలు అవుతున్నా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడం లేదు. వాహనాలను ప్రారంభించక పోవడంతో బ్యాటరీలు పాడై పోవడంతో తుప్పు పట్టే అవకాశం ఉంది. వాహనాలు పాడవ్వకముందే ప్రారంభించాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

ప్రారంభించకుండా ఉంచిన చెత్త సేకరణ వాహనాలు

పెరుగుతున్న ధరలు..వంటమ్మలపై భారాలు

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పప్పులు, వంటనూనె, కూరగాయలు ఇలా ఒక్కటేమిటి అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పాఠశాల పిల్లలకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న వంటమ్మలు అష్టకష్టాలతో నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం భోజనం, అల్పాహారం అందిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న మెనూ ఛార్జీలు ఏమాత్రం సరిపోవడం లేదంటున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ధరలు పెరగడంతో ప్రభుత్వ మెనూ మేరకు భోజనం అందించాలంటే చేతి డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోందంటున్నారు. నాణ్యమైన భోజనం అందించాలంటే ప్రభుత్వం మెనూ ఛార్జీలు పెంచడంతో పాటు వంటమ్మలకు బిల్లులు సకాలంలో చెల్లించడంతో పాటు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకొని మెనూ ఛార్జీలు పెంచాల్సిన అవసరముందని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రభుత్వం ఈపథకానికి సంబంధించి బియ్యం మాత్రమే సరఫరా చేస్తోంది. కూరగాయలు, పప్పు దినుసులు, వంట గ్యాస్ వంటి సామగ్రి నిర్వాహకులే కొనుగోలు చేయాల్సి వస్తోంది. వీటి బిల్లులు అలస్యంగా చెల్లిస్తుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. మెనూ ఛార్జీలు కూడా గతంలో నిర్ణయించినవి కావడం, నిత్యావసర ధరలు పెరగడంతో ప్రభుత్వం ఇస్తున్న డబ్బులు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వం ఇచ్చేది ఏపాటికి..

పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనానికి ఒకటి నుంచి ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5,88, ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు రూ.8.57 చెల్లిస్తోంది. నిత్యావసర వస్తువులు ధరలు పెరిగి ప్రస్తుతం కిలో కందిపప్పు రూ.180, ఉల్లి రూ.35, వెల్లులి రూ.200, ఇక కూరగాయలు ఏది కొనాలన్నా కిలో రూ.40 నుంచి 60లు పెట్టాల్సి వస్తోంది. పెరిగిన ధరలు వంటమ్మలకు పెనుభారంగా మారాయి. మధ్యాహ్న భోజనంతో పాటు వారానికి మూడు రోజులు రాగి జావా అందించాలి. ఇందుకు గ్యాస్ అదనంగా ఖర్చు అవుతోంది.

మెనూ ఇలా....

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం- పెసర పప్పుతో పొంగల్ లేదా వెజ్ పులావ్, గుడ్డు, చిక్కీ, మంగళవారం- పులిహోరా, దొండకాయల చెట్నీ, గుడ్డు, రాగి జావా, బుధవారం- ఆలూ కుర్మా, గుడ్డు, చిక్కీ, గురువారం సాంబార్ బాత్, లేదా పులిహోరా, టమోట చెట్నీ, గుడ్డు, రాగిజావా,
శుక్రవారం - అన్నం, ఆకుకూర పప్పు, గుడ్డు, చిక్కి
శనివారం- అన్నం. ఆకుకూరపప్పు, పప్పుచారు, స్వీట్ పొంగల్, రాగిజావ

మెనూ ఛార్జీలు పెంచాలి

పెరిగిన నిత్యావసర ధరలతో ప్రభుత్వం అందిస్తున్న మెనూ ఛార్జీలు ఏమాత్రం సరిపోవడం లేదు. మెనూ ఛార్జీలు పెంచాలని ఎప్పటి నుంచో అడుగుతున్నాం. అలాగే అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న విధంగా కందిపప్పు సరఫరా చేయాలి. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలి. ప్రస్తుతం పప్పు దినుసులు, వంటనూనె ధరలతో పాటు కూరయాల ధరలకు కూడా పెరిగాయి. వంటమ్మలు అష్టకష్టాలు పడుతూనే కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

బి.సుధారాణి,
జిల్లా కార్యదర్శి, ఎపి మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్

అట్రాసిటీ కేసుపై డిఎస్‌పి దర్యాప్తు

ప్రజాశక్తి - వంగర

లక్షిం పేటలో దర్యాప్తు చేస్తున్న డిఎస్‌పి చక్రవర్తి

మండలంలోని లక్షింపేట గ్రామానికి చెందిన దళిత యువకుడు చితిరి దుర్గా ప్రసాద్‌ను అదే గ్రామానికి చెందిన పొట్నూరు శ్రీనివాసరావుతో పాటు, వేరే మండలం అంపావల్లి గ్రామానికి చెందిన పొట్నూరు శివప్రసాద్, బోన వెంకటేశ్వరరావు తన బైక్ తాళం లాక్కొని కొట్టడంతోపాటు కులం పేరుతో దూషించి భయభ్రాంతులకు గురి చేశారంటూ బాధితుడు వంగర పోలీస్ స్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేశారు. దీంతో చీపురుపల్లి డిఎస్‌పి ఎఎస్ చక్రవర్తి లక్షింపేటలో బుధవారం దర్యాప్తు చేపట్టారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 16న కనుమ పండగ రోజున సాయంత్రం ఐదున్నర గంటల సమయంలో లక్షిం పేట గ్రామానికి చెందిన దళిత యువకుడు చితిరి దుర్గాప్రసాద్ ఎం. సీతారాంపురంలో జరుగు జాతరకు బైక్ పై వెళ్తుండగా లక్షింపేట సమీపంలో ముగ్గురు వ్యక్తులు కారును రోడ్డుకు అడ్డంగా పెట్టారు. కారును పక్కకు తీసి బైక్‌కు దారి ఇవ్వాలని అడగ్గా దళిత యువకుడి బైక్ తాళం లాక్కుని కొట్టడంతో పాటు, కులం పేరుతో దూషించారంటూ దుర్గాప్రసాద్ ఫిర్యాదులో పేర్కొన్నాడని డిఎస్‌పి తెలిపారు. దుర్గా ప్రసాద్ ను అగ్రకులానికి చెందిన వారు కొడుతుండగా చూసి అడ్డుకోవడానికి వెళితే తనను కూడా కొట్టి తన మెడలో ఉన్న బంగారపు పుస్తెలు తాడు లాగేసారని లక్షింపేట గ్రామానికి చెందిన దళిత మహిళ బూరాడ కాసాలు (కాసులమ్మ) డిఎస్‌పికి వివరించింది. కార్యక్రమంలో రాజాం రూరల్ సిఐ ఎస్.శ్రీనివాస్, తహశీల్దార్ డి.ఐజాక్, వంగర ఎస్ఐ వై. వీర జనార్ధన్, ఆర్ఐ జె. మురళి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి సిట్టింగుల్లో గుబులు

సర్వే ఆధారంగా సీట్ల కేటాయింపు, బదలాయింపు

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

వైసిపి సిట్టింగుల్లో గుబులు రేగుతోంది. వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సర్వే ఆధారంగా టికెట్లు ఖరారు చేయనుండడంతో వీరిలో ఆందోళన నెలకొంది. సర్వేలను ఆధారం చేసుకుని రాష్ట్ర వ్యాప్తంగా 72 మందికిపైగా అభ్యర్థులను మార్చనున్నట్లు అందుతున్న సంకేతాలు వెలువడిన నేపథ్యంలో విజయనగరం, మన్యం ఉమ్మడి జిల్లాల పరిధిలోని 11 అసెంబ్లీ స్థానాల్లో సగానికి పైగా ఎమ్మెల్యేల్లో అయోమయం నెలకొంది. ఇప్పటికే రాజాం, బొబ్బిలి, ఎంపి స్థానాల పరిధిలోని ఆశావహులు అభ్యర్థిత్వానికి కుస్తీ పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో టికెట్ల ఫైట్ పతాక స్థాయికి చేరుకుంది. ప్రతిపక్ష టిడిపి, జనసేన సమన్వయంతో ముందుకు సాగుతున్న నేపథ్యంలో వైసిపి అప్ర మత్తమైంది. ప్రతిపక్ష పార్టీల పొత్తు ప్రభావం కనిపించే ప్రాంతాలపై దృష్టి సారించింది. విజయనగరం జిల్లాలో విజయనగరం, గజపతినగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి, ఎస్.కోట, మన్యం జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండ ప్రాంతాలపై తీవ్రంగా కసరత్తు చేస్తోంది. ఈరోజో రేపో 4వ ఫైనల్ జాబితాలో పేర్లు బయటపడే అవకాశం ఉంది. సార్వత్రిక ఎన్నికలకు రెండేళ్ల ముందు నుంచే గడప గడపకూ పేరుతో ఎమ్మెల్యేల పట్ల ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని తగ్గించే ప్రయత్నం చేసింది. వెనుకబడిన ఎమ్మెల్యేలను గుర్తించి దిద్దుబాటు చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. మరో మూడు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో టికెట్లు లభించని ఎమ్మెల్యేలతో సంప్రదింపులు చేస్తోంది. జిల్లా పరిధిలోని ఇప్పటికే రాజాం, బొబ్బిలి, ఎంపి బెల్లాన చంద్రశేఖర్ టిక్కెట్ల కేటాయింపులపై అధిష్టానం క్లియర్ చేసినట్లు తెలుస్తుంది.

సర్వేలతోనే దిశానిర్దేశం

అధికార వైసిపిలో సర్వేల ఆధారంగానే టికెట్లు లభించే అవకాశాలు ఉన్నట్లు తెలు స్తోంది. సుమారు నాలుగు, ఐదు సర్వేలను ముందు ఉంచుకుని నియోజకవర్గాల వారీగా సర్వేలు తేల్చిన ప్రజాదరణ కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యేల పనితీరును పరిశీలించి నిర్ణయం తీసు కుంటున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అధికార పార్టీ అభ్యర్థుల్లో ఎవరికి టికెట్లు లభిస్తాయోననే టెన్షన్ నెలకొంది.

వాహన తనిఖీల్లో డిఎస్‌పి శ్రీధర్, సిఐ, ఎస్ఐ

చెక్ పోస్ట్ వద్ద నిరంతర నిఘా : డిఎస్‌పి

ప్రజాశక్తి-రామభద్రపురం

స్థానిక బైపాస్ జంక్షన్ వద్ద నిర్వహిస్తున్న చెక్ పోస్ట్ వద్ద నిరంతర నిఘా ఉంచుతామని బొబ్బిలి డిఎస్పీ శ్రీధర్ తెలిపారు. బుధవారం సాయింత్రం చెక్ పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పోలీస్ నిఘా పెంచనున్నామని తెలిపారు. డివిజన్ పరిధిలోని చెక్ పోస్ట్ ల వద్ద తనిఖీలు ముమ్మరం చేస్తామని చెప్పారు. పోలీస్ స్టేషన్లనుంచి రోజుకు ఒక ఎస్ఐ స్థాయి అధికారి పర్యవేక్షణలో తనిఖీలు ముమ్మరం చేస్తామన్నారు. ఒడిశా సరిహద్దు ప్రాంతం కావడంతో ఇక్కడ డేగ కళ్ళతో పర్యవేక్షణ జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. అదే తరహాలో సిబ్బందిని కూడా నియమించా మన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు రవాణా అదుపులో ఉందన్నారు. ఎన్నికల వేళ అధిక మొత్తంలో తరలించే నగదు పై నిఘా ఉంటుందని, అట్టి నగదుకు సరైన కారణాలు చూపక పోతే నగదును సీజ్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్ఐ సత్యనారాయణ,చెక్ పోస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

జనసేన నాయకులు అయ్యలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గిరిజన ప్రాంత సమస్యలు పరిష్కరించడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జనసేన నాయకులు గురాన అయ్యలు ఆరోపించారు. ఇకనైనా పట్టించుకోకపోతే తీవ్రంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.బుధవారం ఆయన మీడియా తో మాట్లాడుతూశృంగవరపుకోట మండలం మూలబొడ్డవర పంచాయితీ శివారు చిట్టెంపాడుకు చెందిన మాదల గంగులు ఎదుర్కొన్న హృదయ విదారక సంఘటన తీవ్రంగా కలచివేసిం దన్నారు.ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య పరిస్థితులకు ఈ ఘటన అద్దం పడుతోందన్నారు. రోజుల వ్యవధిలో కుమారుడుని, భార్యను కోల్పోయిన గంగులు ..తన భార్య మృతదేహాన్ని ద్విచక్రవాహనంపై కొద్దిదూరం, డోలీపైన మరికొంతదూరం అవస్థలు పడి స్వస్థలానికి తీసుకెళ్లడం రాష్ట్రంలో మారుమూల గిరిజనులు ఎదుర్కొంటున్న పరిస్థితులను కళ్లకు కడుతోందన్నారు. వైసిపి పాలనలో గిరిజనలకు సరైన వైద్యం కూడా అందించలేకపోతున్నారని అన్నారు. గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో డోలీ మోతలతో సకాలంలో వైద్యం అందక గిరిజనల ప్రాణాలు గాల్లో కలసి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు పట్టని వైసిపి ప్రభుత్వాన్ని మరో మూడు నెలల్లో సాగనంపుతారని మండిపడ్డారు. గిరిజన గ్రామాల్లో రహదారు లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు, గృహ నిర్మాణం, కొండపోడు పట్టాలు వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేదంటే ఆందోళన చేపడతామని తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అయ్యన్నపేటలోని చెంచుల కాలనీలో సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి బియ్యం, బట్టలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెంచుల కాలనీలో ఆరు ఇళ్లు దగ్ధం కావడం విచారకరమని అన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే ప్రజా ప్రతినిధులుగా తమ విధని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ వైసిపి ఇన్చార్జ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జెఎంఎస్‌తో ప్రజారోగ్య సంరక్షణ

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

ప్రజారోగ్య సంరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. బుధవారం పట్టణంలో జగన్నాథపురం ప్రాంతంలోని పాఠశాలలో ఏర్పాటుచేసిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, జెసిఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

పోలమాంబకు 1.6 కిలోల వెండి విరాళం

ప్రజాశక్తి-మక్కువ

స్థానిక చదురుగుడిలో పోలమాంబ అమ్మవారికి పెందుర్తికి చెందిన సాయికిరణ్- రమ్యకీర్తి దంపతులు 1.6 కిలోల వెండి వక్షస్థలం విరాళంగా అందజేసినట్లు ఆలయ ఇఒ వివిఎస్ నారాయణ తెలిపారు. ముందుగా వెండి ఆభరణాన్ని మంగళ వాయిద్యములతో ఊరేగింపుగా ఆలయ మండపం వద్దకు తెచ్చారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, అనంతరం అమ్మవారికి అలంకరించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ దాలినాయుడు, పి.సన్యాసినాయుడు, గంజి బుచ్చినాయుడు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-సాలూరు

సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం పట్టణంలోని 26వ వార్డులో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎస్ఎస్ఆర్ రియల్ ఎస్టేట్ డైరెక్టర్ ఎన్.సూర్యయాదవ్ ఆధ్వర్యాన నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు వార్డు కౌన్సిలర్లు పి.సన్యాసమ్మ, సింగారపు ఈశ్వరరావు, మాజీ కౌన్సిలర్ బి.పైడిరాజు, వైసిపి నాయకులు బీసపు బాలకృష్ణ, వార్డు పెద్దలు గౌడు రమణ, అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ రెడ్డి ధర్మారావు, యడ్ల శంకరరావు, బి.జగదీష్, జి.రామారావు బహుమతులు అందజేశారు.

అంబేద్కర్ చిరస్మరణీయులు : డిసిఎంఎస్ చైర్‌పర్సన్

ప్రజాశక్తి-విజయనగరం

భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మహనీయుడని, భరత జాతికి ఆదర్శ ప్రాయుడు, చిరస్మరణీయులని డిసిఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన అన్నారు. ఈ నెల 19న విజయవాడ స్వరాజ్ మైదానంలో అంబేద్కర్ స్మృతివనం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర పండుగలా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆ మహనీయుని విగ్రహావిష్కరణ కార్యక్రమంలో రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు; బస్సు ఎక్కేందుకు తోపులాడుకుంటున్న ప్రయాణికులు

ప్రయాణికుల పాట్లు

ప్రజాశక్తి-విజయనగరంకోట

సంక్రాంతి పండగ నేపథ్యంలో ప్రయాణికులకు రవాణా సౌకర్యాలు కల్పించడంలో ఆర్‌టిసి అధికారులు విఫలమయ్యారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాక పక్క రాష్ట్రాల్లో ఉంటున్న మన జిల్లాకు చెందిన వలస కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగులు స్వగ్రామాలకు వచ్చిన విషయం తెలిసిందే. వీరంతా తిరుగు ప్రయాణం కావడంతో ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కనుమ పండగ పూర్తి కావడంతో తిరుగు ప్రయాణికులతో ఆర్‌టిసి కాంప్లెక్సు కిటకిటలాడింది. గంటల తరబడి బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. వచ్చిన బస్సుల్లో ఎక్కేందుకు ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు.